

మూల్యాంకనానికి సర్వం సిద్ధం

ఇంటర్ పరీక్షల మూల్యాంకనానికి కడపలో ఏర్పాట్లు పూర్తయాయి. -8లో..



24 గంటల్లో మిస్సింగ్ కేసు ఛేదన

ఇంటి నుంచి వెళ్లిన తల్లి, ఆరుగురు బిడ్డలు సురక్షితంగా ఇంటికి చేరారు. పోలీసులు 24 గంటల్లో కేసును ఛేదించారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.7/25.2

జిల్లాలో శుక్రవారం 25.2 – 38.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. –కడప అగ్రికల్చర్.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సహర్ ఆది (ఉ॥)
కడప	6.31	4.55
ప్రొద్దుటూరు	6.28	5.00
పులివెందుల	6.33	5.00

జగదభిరాముడి ప్రభ..
జగమంతా శోభ

- ఒంటిమిట్ట రామయ్య బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- వైభవంగా ధ్వజారోహణం
- శేషవాహనంపై విహరించిన జానకిరమణుడు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు



ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



స్వామివారిని చూసి తన్మయులై నమస్కరిస్తున్న భక్తులు



ధ్వజస్తంభానికి హారతి ఇస్తున్న పండితులు



అలరించిన కళాకారుల కోలాటం

ఒంటిమిట్ట: ఏకశిలానగరి ఒంటిమిట్టలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేదపండితులు ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత హోమం జరిపారు.అనంతరం గరుడ పతాకాన్ని ఎగురవేశారు.కంకణభట్టర్ రాజేష్ ఆధ్వర్యంలో వృషభలగ్నంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలో కేరళ వాయిద్య కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు సీతారామలక్ష్మణలు ఒంటిమిట్ట పురవీధుల్లో శేషవాహనంపై విహరించారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని తరించారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సతీసమేతంగా ఒంటిమిట్టకు విచ్చేశారు. పూజలు నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, అధికారులు, ఒంటిమిట్ట, సిద్దవటం, రాజంపేట నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు వేణుగానాలంకారణలో ధాశరథి దర్శనమివ్వనున్నారు. రాత్రి 8 గంటలకు హంసవాహనంపై స్వామివారు విహరిస్తారు.



మాడ వీధుల్లో శేష వాహనంపై విహరిస్తున్న కోదండ రాముడు

కల్యాణోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 5న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవ ఏర్పాట్లను వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కల్యాణోత్సవం రోజున పట్టువస్త్రాలు సమర్పణకు వచ్చినప్పుడు ఆలయంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో వారు చర్చించారు. గ్యాలరీల్లో భక్తులకు కల్పించాల్సిన వసతుల గురించి మాట్లాడారు. జిల్లా కార్యక్రమంలో టీటీడీ డీఎఫ్‌వో శ్రీనివాస్, ఎస్ఇ(ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, డీఈ చంద్రశేఖర్, ఇఇ సుమతి, డెప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, నటేష్ బాబు, శివప్రసాద్, సుబ్రహ్మణ్యం, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ సాయికాంత్ వర్మ, జేఈవో వీరబ్రహ్మం

న్యూస్‌రీల్

తిరువన్నామలైకి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: పౌర్ణమి సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలైకి కడప రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డిపోల నుంచి సాధారణ బస్సులతోపాటు ఏసీ సర్వీసులు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెద్ద దర్గాను దర్శించుకున్న కేసీఆర్ అల్లుడు



పెద్దదర్గాలో ప్రార్థన చేస్తున్న అనిల్‌కుమార్

కడప కల్చరల్: కడప నగరంలోని ప్రఖ్యాత పెద్ద దర్గాను తెలంగాణ సీఎం కేసీఆర్ అల్లుడు, ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. తన సోదరుడు కిరణ్‌కుమార్‌తో కలిసి దర్గాలోని పీరుల్లా మాలిక్ మజార్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఇతర గురువుల మజార్లను దర్శించుకున్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పట్టు పురుగుల పెంపకంతో ఆర్థిక స్వావలంబన

కడప ఎడ్యుకేషన్: పట్టు పురుగుల పెంపకంతో రైతన్నలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు పేర్కొన్నారు. ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లెలో 90 శాతం సబ్సిడీలో రైతు దేవదాసు నూతన రేరింగ్‌షెడ్డు నిర్మించారు. శుక్రవారం దీనిని జిల్లా సెరికల్చర్ అధికారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టుసాగుకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ శ్రీనివాసులరెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ సుబ్బారావు, ఏఆర్ఎస్ ఎస్ఓ దీక్షిత్, ఏఎస్ఓ సూర్యుడు, నాగేశ్వరెడ్డి, పట్టుపరిశ్రమ సిబ్బంది సుబ్బరాయుడు, ఎంవీ రాజు, గుర్రప్ప, సరోజినిదేవి, కళ్యాణి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాలు విడుదల

పులివెందుల రూరల్ : పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం బీటెక్ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వసుంధర శుక్రవారం తెలిపారు. ఫలితాలను తక్కువ సమయంలో విడుదల చేసినందుకు పరీక్షా కేంద్ర విభాగాధిపతులైన ప్రొఫెసర్ కె.త్యాగరాజన్, డాక్టర్ ఎస్.రాధాకృష్ణలను అభినందించారు. పరీక్షా ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని.. విద్యార్థులు వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ వసుంధర, వైస్ ప్రిన్సిపల్ రమణారెడ్డి, పరీక్షా కేంద్ర విభాగాధిపతులు, వివిధ డిపార్ట్‌మెంట్ల విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

డాక్టర్ అచ్చెన్న హత్యాస్థలం పరిశీలన



రాయచోటి ఘాట్‌లో అచ్చెన్న హత్యా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

కడప కార్పొరేషన్: పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న హత్య జరిగిన ప్రదేశాన్ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పరిశీలించారు. శుక్రవారం కడపకు విచ్చేసిన ఆయన రాయచోటి రోడ్డులో ఘాట్‌లో డాక్టర్ అచ్చెన్న మృత దేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించి హత్య జరగడానికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం చేరుకొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, ఎస్సీ కమిషన్ మెంబర్ సుదర్శనం, ప్రముఖ పారిశ్రామిక వేత్త కోలా ప్రసాద్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు డి. సువర్ణరాజు, జె. ఫణీంద్ర కుమార్, కార్పొరేటర్ చెన్నయ్య, చైతన్య, శివ పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రైవేటు వ్యక్తులు విధుల్లో ఉండకూడదు
- పది పరీక్షల అబ్జర్వర్ వెంకటకృష్ణారెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న పది పరీక్షల అబ్జర్వర్‌వెంకట కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: పది పరీక్షల విధుల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని కడప, అన్నమయ్య జిల్లాల పది పరీక్షల అబ్జర్వర్, మోడల్ స్కూల్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్(సర్వీసెస్) మార్తల వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం కడపకు చేరుకుని డీఈఓ రాఘవరెడ్డితో కలిసి పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వైఎస్సార్‌జిల్లాలో 146 పరీక్షా కేంద్రాల్లో 27,211 మంది పరీక్షల రాయనున్నారన్నారు. జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్ ఉంటుందన్నారు. జిల్లాలో 8 సెన్సిటివ్ పరీక్షా కేంద్రాలను గుర్తించామని వాటిలో అదనపు బందోబస్తు ఉంటుందన్నారు.నందమండలం బాలుర, ఖాజీపేట బాలికల హైస్కూలు, కాశినాయన ఏపీఎంఎస్, చక్రాయపేట కేజీబీవీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాలలో ప్రైవేటు వ్యక్తులు విధుల్లో ఉండకూడదన్నారు. ఎవేరికీ సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న సిబ్బందికి పరీక్ష విధులను కేటాయించరాదన్నారు. పరీక్షా కేంద్రంలో పిల్లలలకు సంబంధించిన వివరాలన్నీ నోటీసు బోర్డులో ఉండాలన్నారు. ఇన్విజిలేటర్లు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా పొరపాటు జరిగితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఈఓ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సంస్మరణ





శ్రీనాథ్‌రెడ్డి ఆత్మశాంతి కోసం మౌనం పాటిస్తున్న దృశ్యం, దివంగత జర్నలిస్టు నరసింహులు పెద్ద కుమార్తె మౌక్తికకు రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న 'మనం' ప్రతినిధులు

ప్రముఖ జర్నలిస్టు, ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సంస్మరణ సభ కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ హోం మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి హాజరైన ఈ కార్యక్రమంలో జాతీయ మీడియా ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్, సీనియర్ ఎడిటర్ కె.రామచంద్రమూర్తి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ తులసిరెడ్డి, టీడీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ జి.లక్ష్మిరెడ్డి, సీపీఐ, సీపీఎం నాయకులు జి.చంద్ర, చంద్రశేఖర్, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాసరెడ్డి, హిందూ దినపత్రిక మాజీ రెసిడెంట్ ఎడిటర్ ప్రశాంత్‌రెడ్డి, జానమద్ది విజయభాస్కర్, మనం స్వచ్ఛంద సంస్థ బాధ్యులు రామాంజనేయులు, ప్రసన్నకుమార్ తదితరులు మాట్లాడారు. శాసనమండలి సభ్యులు సి.రామచంద్రయ్య, తిరుపతి నుంచి సీనియర్ జర్నలిస్టు రవికుమార్‌లు పంపిన సందేశాలను సభాధ్యక్షుడు నాగిరెడ్డి చదివి వినిపించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి వందన సమర్పణ చేశారు. డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి బీవీ నాగిరెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు, మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కాగా, ఇటీవల మృతిచెందిన జర్నలిస్టు నరసింహులు పెద్ద కుమార్తె మౌక్తిక సివిల్ సర్వీస్ శిక్షణకు మనం సంస్థ ప్రతినిధులు రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. నరసింహులు చిన్నకుమార్తె చదువుకోసం రూ.లక్ష చెక్కును కడప జర్నలిస్టు మిత్రులు అందజేశారు. –కడప సెవెన్‌రోడ్స్

ఆరోగ్యానికి సంపూర్ణత

- సత్ఫలితాలిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణకిట్లు
- లబ్ధిదారులకు ఆరు రకాల పౌష్టికాహార పదార్థాల పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 26,335 మందికి కిట్లు అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల నుంచి అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం మంచి ఫలితాలిస్తోంది. పోషక విలువలు తక్కువగా ఉన్న గర్భిణులు, బాలింతలు ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్కువ సమయంలో ప్రసవానంతరం రక్తహీనతతో అనేక మంది మృత్యువాత పడుతున్నారు. దీనిని గమనించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని భావించారు. అందుకోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ప్రసవానంతరం ఆరు నెలల వరకు నెలవారీ ఆరు రకాల పౌష్టికాహార పదార్థాలతో కూడిన కిట్లను అందిస్తున్నారు. వీటితోపాటు పోషక విలువలతో కూడిన భోజనాన్ని కూడా మధ్యాహ్న సమయంలో గర్భిణీలు, బాలింతలకు వండిపెడుతున్నారు. అయితే భోజనానికి రాని వారికి రోజుకో గుడ్డు, వారానికి సరిపడ లీటరు పాలు సరఫరా చేస్తున్నారు. దీంతో గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం మెరుగు పడుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్‌లో ఆరు రకాల ఆహార పదార్థాలు ఉంటాయి. కిలో రాగి పిండి, కిలో చిరుధాన్యాల పిండి, కిలో అటుకులు, పావుకిలో శనగ చిక్కీలు, పావుకిలో బెల్లం, పావు కిలో ఎండు ఖర్జూరం ఉంటాయి.



వైఎస్సార్ పోషణ కిట్లతో లబ్ధిదారులు

జిల్లాలోని సంపూర్ణ పోషణ పథకం లబ్ధిదారుల వివరాలు

ప్రాజెక్టు పేరు	గర్భిణులు	బాలింతలు
బద్వేలు	754	764
కడప రూరల్	1402	1616
కడప అర్బన్	1932	2064
జమ్మలమడుగు	791	845
కమలాపురం	958	1072
లక్కిరెడ్డిపల్లె	188	247
ముద్దనూరు	764	717
పోరుమామిళ్ల	659	692
ప్రొద్దుటూరు అర్బన్	920	1039
ప్రొద్దుటూరు రూరల్	1955	1911
పులివెందుల	1416	1478
సిద్దవటం	1029	1122

నాణ్యత బాగుంది



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతినెల వైఎస్సార్ సంపూర్ణ పోషణతో కూడిన ఆరు రకాల పదార్థాలను అందిస్తున్నారు. అవి చాలా బాగున్నాయి. వీటితోపాటు గుడ్లు, పాలు కూడా ఇస్తున్నారు. వీటిని తినడం ద్వారా ఆరోగ్యం బాగా మెరుగు పడుతుంది.

– పి.షీరిన్, గర్భిణీ, కడప

ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్ పదార్థాలను అందించడం అభినందనీయం. వీటిని వాడటం వల్ల మాకు ఆరోగ్యం బాగుంది. ఇందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– అర్షియ, గర్భిణీ, కడప

అందరూ వినియోగిస్తున్నారు



అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఇస్తున్నాం. వీటి వల్ల పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ కిట్లను సక్రమంగా వినియోగిస్తున్నారు.

– సునంద, సీడీపీఓ, కడప అర్బన్

అర్హులందరికీ అందజేస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం మంచి ఉద్దేశంతో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తోంది. వీటిని అర్హులకు సకాలంలో అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతతో వీటిని లబ్ధిదారులకు సకాలంలో అందిస్తున్నారు.

– ఎంఎస్ రాణి, ఐసీడీఎస్ పీడీ, కడప

రిమ్స్‌కు 14 పీజీ సీట్లు మంజూరు



కడప రిమ్స్ ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో సైకియాట్రి, ఫెథాలజీ విభాగాల అధ్యాపకులు

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల(రిమ్స్)కు 2023–24 వైద్య విద్యాసంవత్సరానికిగాను సైకియాట్రిలో ఐదు, పెథాలజీలో 9 పీజీ సీట్లు మంజూరయ్యాయి. దీంతో శుక్రవారం కడప రిమ్స్‌లోని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ ఆధ్వర్యంలో అధ్యాపక వైద్యులు, సిబ్బంది కేక్ కట్ చేశారు. ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ, సైకియాట్రి హెచ్ఓడి డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరాముడు, ఇతర విభాగాల ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

- తాజాగా ఎన్ఎంసీ వారు 11 విభాగాల్లో ఇటీవల పీజీ సీట్ల కోసం పరిశీలన చేసి మొత్తం మరో 71 పీజీ వైద్య విద్య సీట్లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ప్రస్తుతం 11 విభాగాల్లోని రెండు విభాగాలకు శుక్రవారం సైకియాట్రీలో 5, పెథాలజీలో 9 పీజి వైద్య సీట్లు మంజూరయ్యాయి. దీంతో ఇప్పటివరకు 10 విభాగాల్లో 44 పీజీ సీట్ల నుంచి 12 విభాగాల్లో 58 పీజీ సీట్లకు చేరుకుంది. ఇంకా 9 విభాగాల్లో పీజీ సీట్ల మంజూరు వివరాలు త్వరలో తెలియనున్నాయి.

మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం
- కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వేదికగా ఏర్పాట్లు



మూల్యాంకనం నిర్వహించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వ్యాల్యుయేషన్)కు ఏర్పాట్లు పూర్తయాయి. ఈ ప్రక్రియ ఏప్రిల్ 1వ తేదీ నుంచి కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వేదికగా ప్రారంభంకానుంది. మూల్యాంకనం జరగుతున్న అన్ని గదుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దిద్దుబాటులో జరిగే తప్పులు, దోషాలకు ఎగ్జామినర్లు, సిబ్బంది బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని ఇంటర్ అధికారులు తెలిపారు.

నాలుగు విడతల్లో..

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన మూల్యాంకనం కోసం 3,02,685 జవాబు పత్రాలు జిల్లాకు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,74, 092 పేపర్లు జిల్లాకు చేరుకున్నాయి. వీటిలో 2,25,227 వాటికి కోడింగ్ కూడా పూర్తి చేశారు. జవాబు పత్రాల మూల్యాంకనం మొత్తం నాలుగు విడతల్లో జరగనుంది. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు, 2వ సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. ఇందులో ఒక ఎగ్జామినర్ పూటకు 15 చొప్పున రోజుకు 30 పేపర్లను దిద్దాల్సి ఉంటుంది. ఈ మూల్యాంకనం కోసం 1023 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను, 121 మంది చీఫ్ ఎగ్జామినర్లను 88 స్క్రూటినైజర్స్‌ను నియమించారు.

సిబ్బంది నియామకం పూర్తి

మూల్యాంకనం విధుల కోసం ఎగ్జామినర్ల నియామక ఉత్తర్వులను ఇంటర్మీడియెట్ బోర్డు ఇప్పటికే ఆయా కళాశాలలకు చేరవేసింది, పేపర్ వ్యాల్యుయేషన్ ప్రక్రియలో భాగంగా స్పాట్ క్యాంపు ఆఫీసర్‌గా ఆర్ఐవో రమణరాజు వ్యవహరిస్తారు. జనరల్-1 కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, జనరల్-2 గా కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సీనియర్ లెక్చరర్స్ హరిప్రసాద్, సీసీఓ-1గా జమ్మలమడుగు బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, సీసీఓ-2గా ప్రొద్దుటూరు పీఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్యలు నియమితులయ్యారు. వీరితోపాటు కోడింగ్ ఆఫీసర్లు, ఏసీవోలు, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంటు ఎగ్జామినర్ల నియామక ప్రక్రియ పూర్తయింది.

షెడ్యూల్ ఇలా...

విడత	మొదలయ్యే తేదీ	దిద్దనున్న సబ్జెక్టు వివరాలు
1వ స్పెల్	ఏప్రిల్ 1 నుంచి	తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మ్యాథ్స్, సివిక్స్
2వ స్పెల్	ఏప్రిల్ 3 నుంచి	ఫిజిక్స్, ఎకనామిక్స్
3వ స్పెల్	ఏప్రిల్ 5 నుంచి	కెమిస్ట్రీ, హిస్టరీ
4వ స్పెల్	ఏప్రిల్ 8 నుంచి	కామర్స్, బోటనీ, జువాలజీ

మూల్యాంకన విధులకు హాజరు కాకపోతే చర్యలు



జిల్లాలో శనివారం నుంచి ప్రారంభం కానున్న మూల్యాంకన విధులకు కేటాయించిన సిబ్బంది తప్పక హాజరు కావాలి. హాజరుకాని వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవు. సంబంధిత కళాశాలలకు జరిమానా విధిస్తాం. కావున వారి స్పెల్స్‌ను బట్టి విధులకు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుంది. మూల్యాంకన కేంద్రంలోకి సెల్‌ఫోన్‌ను అనుమతించడం జరగదు. పేపర్ల దిద్దుబాటులో అలసత్వం ప్రదర్శించి తప్పులు చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు.

– రమణరాజు, ఆర్ఐవో, ఇంటర్ స్పాట్ క్యాంపు ఆఫీసర్.

రిమ్స్‌లో గుర్తుతెలియని మృతదేహాలు





కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలను పొందుతున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందారు. వారి ఆచూకీ తెలియరాలేదు. ఎవరైనా వారి బంధువులు, కుటుంబ సభ్యులు వుంటే తమను సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



సామగ్రి కాలిపోయిన దృశ్యం

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని రామ్‌నగర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధం అయింది. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వర్షం ఆగినప్పటికీ కరెంట్ సరఫరా కాకపోవడంతో నరసింహులు కుటుంబ సభ్యులు ఇంటి ఆరుబయటే నిద్ర పోయారు. అయితే అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ సరఫరా కావడం, షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు అంతా కాలి బుగ్గి అయింది. ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్, ఇతర సామగ్రితోపాటు పశువుల మేత కూడా కాలిపోయింది. దీంతో దాదాపు రూ.50 నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

పలు రైళ్లకు అదనపు బోగీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూరి-యశ్వంతపూర్, శివమొగ్గ-చెన్నై, బెలగావి-సికింద్రాబాద్ తదితర రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేశామని, మరికొన్ని రైళ్లను పొడిగించామని ఆయన పేర్కొన్నారు.

గ్రామోత్సవంలో అపశ్రుతి



మృతి చెందిన వెంకటరెడ్డి

వీరపునాయునిపల్లె : శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం రాత్రి మండలంలోని మొయిళ్లచెరువు గ్రామంలో నిర్వహించిన గ్రామోత్సవంలో అపశ్రుతి నెలకొంది. ఈ ఘటనలో వెంకటరెడ్డి (60) మృతి చెందాడు. ఎస్సై రాజా రమేష్ తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను తిలకించేందుకు పెంకులకొట్టం పైకి ఎక్కడంతో ప్రమాదవశాత్తు కిందపడటంతో వెంకటరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరి పిల్లలకు వివాహాలయ్యాయి.

రసవత్తరంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో బార్ అసోసియేషన్ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. శుక్రవారం కోర్టు క్లాంప్లెక్స్ ఆవరణలో రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. పట్టణ పోలీసుల బందోబస్తు మధ్య పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. 126 ఓట్లకు గాను 121 ఓట్ల పోలింగ్ జరిగింది. ఓటు హక్కు కోల్పోయిన 24 మంది హైకోర్టు ఆదేశాల మేరకు తిరిగి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్ కుమార్‌రాజుతోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులు ఓటు వేశారు.

బార్ నిర్వహణ గత అసోసియేషన్‌కే అప్పగింత

బార్ అసోసియేషన్ నిర్వహణ గత అసోసియేషన్‌కే అప్పగించారు. ఈ మేరకు ఏపీ బార్ కౌన్సిల్ సెక్రటరీ పద్మలలిత నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. న్యాయవాదులు జిలానీ తదితరులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు.. బార్ నిర్వహణ విషయం గత అసోసియేషన్ చూసుకోవాలని ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ ఉత్తర్వులను ఎన్నికల అధికారి బాలాజీకి మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితర కార్యవర్గం అందజేసింది.

అసోసియేషన్ కార్యాలయంలో బ్యాలెట్ బాక్స్‌లు

హైకోర్టు ఆదేశాల మేరకు సీల్ చేసిన బ్యాలెట్ బాక్స్ భద్రతపరిచే అంశాన్ని ఎన్నికల అధికారి బాలాజీకి అప్పగించింది. ట్రెజరీలో డిపాజిట్ చేసుకునేందుకు నిరాకరణ ఎదురైంది. దీంతో శాంతి భద్రతల సమస్యను దృష్టిలో వుంచుకొని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బ్యాలెట్‌బాక్స్‌ను పోలీసుస్టేషన్‌లో పోటీలో ఉన్న ఇరువురు అభ్యర్థుల అంగీకారంతోనే భద్రత పరిచేలా డీఎస్పీ ముందుకొచ్చారు. అయితే ఒక వర్గం ససేమిరా అనడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చివరికి బార్ అసోసియేషన్ కార్యాలయంలో కొత్త బీరువాలో వాటిని భద్రపరిచి, సీజ్ చేశారు.

వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌కు అభినందన



రవిశంకర్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : ఆలిండియా విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌గా నిలిచి పతకం సాధించిన జి.రవిశంకర్‌ను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్ధన అభినందించారు. ఇటీవల చండీఘర్‌లో నిర్వహించిన అఖిల భారత విశ్వవిద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 81 కేజీల విభాగంలో వైవీయూ క్రీడాకారుడు జి.రవిశంకర్ 315 కేజీల బరువు ఎత్తి కాంస్యపతకం సాధించిన విషయం తెలిసిందే. శుక్రవారం వైవీయూలో క్రీడాబోర్డు ఆధ్వర్యంలో ఆయనను అధికారులు అభినందించారు. వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ విజేతకు 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి క్రీడాప్రతిభా పురస్కారం కింద రూ. 30 వేల నగదు, ప్రతి నెలా రూ.10 వేల స్కాలర్‌షిప్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పరిశోధకులకు వెబ్‌సైట్‌లో సమగ్ర సమాచారం

యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో పరిశోధకులకు విలువైన సమగ్రమైన సమాచారం అందుబాటులోకి తీసుకువస్తూ వెబ్‌సైట్ క్లిక్‌ను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్ధన రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. శుక్రవారం విశ్వవిద్యాలయం ఐటీ హబ్ సంచాలకులు ఆచార్య ఎం.వి. శంకర్ ఆధ్వర్యంలో నూతనంగా వైవీయూ వెబ్‌సైట్‌లో పరిశోధన, అభివృద్ధికి సంబంధించి అంశాలు, ఎన్ఎస్ఎస్ విభాగాలను పొందుపరిచారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యురాలు ఆచార్య పుత్తా పద్మ, ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఆచార్య పి.చంద్ర ఓబులరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

24 గంటల్లో మిస్సింగ్ కేసు ఛేదన

- పోలీసుల చొరవతో తల్లీబిడ్డలు ఇంటికి..
- భర్తతో గొడవపడి ఆరుగురు పిల్లలతో కలిసి వెళ్లిన భార్య



వెంకటసుబ్బమ్మ, పిల్లలతో సీఐ ఇబ్రహీం, కానిస్టేబుళ్లు బాబాఫకృద్దీన్, రామాంజనేయులు

ప్రొద్దుటూరు క్రైం : పోలీసుల చొరవతో తల్లీ, ఆరుగురు బిడ్డలు సురక్షితంగా ఇంటికి చేరారు. భర్తతో గొడవ పడిన ఆమె ఆరుగురు చంటి బిడ్డలతో ఇంటి నుంచి వెళ్లడంతో బంధువులతో పాటు పోలీసుల్లోనూ ఆందోళన నెలకొంది. అయితే పోలీసుల కృషితో తల్లీ పిల్లలు సురక్షితంగా ఇంటికి చేరారు. ఈ కేసు వివరాలను టూ టౌన్ సీఐ ఇబ్రహీం శుక్రవారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. ప్రొద్దుటూరులోని మోడంపల్లెకు చెందిన శ్రీరాములు లారీ డ్రైవర్‌గా వెళ్తుంటాడు. అతనికి భార్యతోపాటు ఆరుగురు పిల్లలున్నారు. గురువారం భార్య భర్తలు గొడవ పడ్డారు. దీంతో వెంకటసుబ్బమ్మ తన ఆరుగురు బిడ్డలను తీసుకొని ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. వీధిలోనూ, పట్టణంలో వారి కోసం గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో అదే రోజు రాత్రి వెంకటసుబ్బమ్మ తల్లి నారాయణమ్మ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అప్రమత్తమైన టూ టౌన్ సీఐ ఇబ్రహీం సీసీ కెమెరాల ద్వారా పట్టణమంతా గాలించారు. అయినా వారి జాడ తెలియలేదు. రాత్రి పొద్దుపోయే వరకు ప్రొద్దుటూరుతోపాటు ఎర్రగుంట్ల, కడప రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో వారి కోసం అన్వేషణ సాగించారు. అక్కడ ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించినా వారి గురించిన ఆచూకీ లభ్యం కాలేదు.

ఆమె వద్ద సెల్‌ఫోన్ లేకున్నా..

ఏదైనా మిస్సింగ్ కేసు నమోదైతే సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు కేసును ఛేదిస్తుంటారు. లొకేషన్ ఆధారంగా అదృశ్యమైన వారిని సులభంగా గుర్తిస్తారు. అయితే ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంకటసుబ్బమ్మ వద్ద సెల్‌ఫోన్ లేకపోవడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. సీఐ ఇబ్రహీం వారి కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం వేకువజాము నుంచి నంద్యాల జిల్లాలోని యాగంటి, మహానంది, అహోబిలం తదితర పుణ్యక్షేత్రాలు, అన్నసత్రాల్లో పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తల్లీ, ఆరుగురు పిల్లలు అహోబిలంలోని ఆశ్రమంలో క్షేమంగా ఉండటంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. తల్లి వెంకటసుబ్బమ్మతో పాటు పిల్లలు అశ్రిత, అజయ్, అనూషా, కల్యాణి, లావణ్య, బద్రిలను శుక్రవారం సాయంత్రం ప్రొద్దుటూరుకు తీసుకువచ్చారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోపే కేసును ఛేదించిన టూ టౌన్ సీఐ ఇబ్రహీం, కానిస్టేబుళ్లు బాబాఫకృద్దీన్, రామాంజనేయులును ఎస్పీ అన్బురాజన్, ఏఎస్పీ ప్రేరణకుమార్ అభినందించారు. భార్యాభర్తల మధ్య ఏదైనా సమస్య తలెత్తితే నేరుగా స్టేషన్‌కు రావాలని సీఐ ఇబ్రహీం తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిపోవడం లాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. స్టేషన్‌కు వస్తే కౌన్సెలింగ్ ఇవ్వడం లేదా కేసు నమోదు చేయడమో చేస్తామన్నారు.

విడిపోయిన రైలు వ్యాగిన్లు

పలురైళ్లు నిలిపివేత



విరిగిపోయిన వ్యాగిన్ కప్లింగ్ నక్కల్

రాజంపేట : ముంబయి-చెన్నై రైలు మార్గంలో కడప-నందలూరు సెక్షన్ల మధ్య కనుమలోపల్లె-భాకరాపేట(248/3కి.మీ) మధ్య శుక్రవారం ఐరన్‌ఓర్ (ఏకేపీకే) కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే గూడ్స్‌రైలు ఫార్మిసిన్ తెగిపోయింది. డబుల్‌లైనులో అప్‌లైన్(నందలూరువైపు)లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఆ సమయంలో ఈ మార్గంలో నడిచే పలురైళ్లను నిలిపివేశారు. ఇందులో కాచిగూడ-మంగళూరు ఎక్స్‌ప్రెస్, కడప-అరక్కోణం ప్యాసింజర్ రైళ్లను కనుమలోపల్లిలో నిలిపివేశారు. ఈ రైళ్లతో పాటు పలు గూడ్స్‌రైళ్లను కూడా నిలిపివేయాల్సి వచ్చింది.

తెగిపోయిన కప్లింగ్ నక్కల్

ఏకేపీకే గూడ్స్‌రైలు ఫార్మిసిన్‌లో లోకో(రైలింజన్) నుంచి 42 వ్యాగిన్ ఎస్ఈసీఆర్1167, ఈసీఆర్ 11144 వ్యాగిన్ మధ్య కప్లింగ్ నక్కల్ తెగిపోయింది. దీంతో గూడ్స్‌రైలు ఫార్మిసిన్ రెండు భాగాలు వేరుపడ్డాయి. ఒక భాగం లోకో, మరోభాగంకు గార్డు బ్రేక్‌లు వేర్వేరు కావడంతో రన్నింగ్‌స్టాఫ్ అప్రమత్తయ్యారు. విడిపోయిన ఫార్మిసిన్ వ్యాగిన్లు నిలిచిపోయాయి.

రంగంలోకి దిగిన టీఎక్స్ఆర్ సిబ్బంది

గూడ్స్‌రైలు తెగిపోవడంతో టీఎక్స్ఆర్ సిబ్బందిని రంగంలోకి దింపారు. కప్లింగ్ నక్కల్ తెగిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. బీపీసీ(బ్రేక్‌పవర్ సర్టిఫికెట్) ఎక్కడ ఇచ్చారు, ఎలా అనే అంశం గురించి తెలుసుకున్నారు. వివరాలను గుంతకల్ డివిజన్ ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా పంపారు.

భాకరాపేటకు చేరిన విడిపోయిన ఫార్మిసిన్

తెగిపోయిన ఐరన్‌ఓర్ గూడ్స్‌రైలు ఫార్మిసన్ భాకరాపేటకు తీసుకొచ్చారు. లోకోతో పాటు వచ్చిన వ్యాగిన్లను తీసుకొచ్చేశారు. అలాగే తెగిపోయి విడిగా ఉన్న ఫార్మిసిన్ కూడా భాకారాపేటకు తీసుకువచ్చారు.

తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రసవం



ప్రసవించిన శిశువుతో బి.కొత్తకోట ఆస్పత్రిలో విద్యార్థిని

బి.కొత్తకోట : తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని మగ శిశువును ప్రసవించిన ఘటన శుక్రవారం సంచలనం కలిగించింది. ఓ వివాహితుడు మూడేళ్లుగా బాలికను ఓ ఇంటి వద్దకు తీసుకెళ్తూ అఘాయిత్యానికి పాల్పడుతూ గర్భానికి కారకుడైనట్టు పోలీసుల విచారణలో వెల్లడైనట్టు తెలిసింది. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరుకు చెందిన 14 ఏళ్ల బాలిక స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ బాలిక తల్లిదండ్రులు ఆరునెలల క్రితం విడాకులు తీసుకుని విడిగా ఉంటున్నారు. బాలిక స్వగ్రామంలో తండ్రి వద్దనే ఉంటోంది. బాలిక తండ్రి మూడేళ్ల క్రితం టైలరింగ్ వృత్తి వదలి గొర్రెలను మేపుకొంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం బాలికకు కడుపునొప్పిగా ఉండటంతో కుటుంబ సభ్యుల సమాచారంతో 108లో బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవ పరిస్థితి కలిగింది. శిశువు తల వెలుపలికి రావడంతో సిబ్బంది వైద్యసేవలు అందిస్తూ బి.కొత్తకోట సీహెచ్‌సీకి చేరుకున్నారు. ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ హసీనా బేగం బాలికకు శస్త్రచికిత్స చేయకుండానే సహజ ప్రసవం అయ్యేలా వైద్యం అందించారు. తర్వాత బాలిక, శిశువును పరీక్షించి ఆరోగ్యంగానే ఉన్నట్టు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సీఐ సాధిక్ అలీ, పీటీఎం ఎస్ఐ మధురామచంద్రుడు సిబ్బందితో ఆస్పత్రికి చేరుకుని బాలికను విచారణ చేశారు. కందుకూరుకు చెందిన నరసింహులు అనే యువకుడికి వివాహమైంది. ఇతను మూడేళ్లుగా బాలికను ఓ పాడుబడిన ఇంటివద్దకు తీసుకెళ్లి శారీరకంగా కలిసేవాడని, ఈ విషయం ఇంటిలో చెప్పలేదని బాలిక పోలీసులకు చెప్పినట్టు తెలిసింది.

ఆర్టీపీపీలో ఉద్యోగుల ఆందోళన



ఆర్టీపీపీలో ఆందోళన చేస్తున్న అకౌంట్స్ సిబ్బంది

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ)లో అకౌంట్స్ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులు ఇతర సిబ్బంది తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ అకౌంట్‌లో విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులు ఉదయం 10.30 గంటలకు విధులకు హాజరు అవుతారన్నారు. అయితే ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉదయం 9 గంటలకే విధులకు హాజరు కావాలని ఏపీ జెన్‌కో ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిబ్బంది నిరసన బాట పట్టారన్నారు.

గండి నిత్యాన్నదానానికి రూ.లక్ష



దాతలకు స్వామి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ అధికారి, చైర్మన్

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం రూ.1,00,116 విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. తొండూరు మండలం ఊడవగండ్ల గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు దాసరి సహదేవరెడ్డి, రామలక్షుమమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తె వెంకటసౌదామిని, అల్లుడు డీవీ గోపాల్‌రెడ్డి(ఉపాధ్యాయుడు) విరాళం ఇచ్చారని చెప్పారు. ఆలయ నిబంధనల ప్రకారం వారితో ప్రత్యేక పూజలు చేయించి, శేషవస్త్రం, స్వామి వారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు ఇచ్చి గౌరవించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాఘువేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

తండ్రిని హతమార్చిన కుమారుడి అరెస్ట్

ఓబులవారిపల్లె : మండలంలోని గోవిందంపల్లి పంచాయతీ పోలివాండ్లపల్లి గ్రామానికి చెందిన జి వెంకటేశ్వర్లు (45)ను గొంతు నులిమి హత్య చేసిన కుమారుడు శివప్రసాద్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సీఐ వివరాలు వెల్లడించారు. పోలివాండ్లపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు ఒక్కగానొక్క కుమారుడు శివప్రసాద్ ఉన్నాడు. తండ్రి వెంకటేశ్వర్లు పూజలు, తాయత్తులు వేస్తూ జీవనం సాగించేవాడు. శివప్రసాద్ ప్రేమ వివాహం చేసుకొని ముద్దనూరులో నివాసం ఉండేవాడు. ఉగాదికి ఇంటికి వచ్చిన శివప్రసాద్‌తో తండ్రి గొడవపడి చేతబడి చేస్తానని బెదిరించాడు. తన తండ్రి అనుకున్నంత పని చేస్తాడని శివప్రసాద్ తండ్రిని కారులో తీసుకొని.. యల్లాయపల్లె సమీపంలో గొంతు నులిమి హత్య చేశాడు. తండ్రి కనిపించడం లేదని బంధువులతో కలిసి చుట్టు పక్కల వెతికాడు. సమీపంలో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గుర్తించి మద్యం మత్తులో చనిపోయాడని పూడ్చివేశారు. ఈ విషయంపై అనుమానం వచ్చిన మృతుడి తమ్ముడు నరసింహులు తన అన్నను హత్య చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పూడ్చిన మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా గొంతు నులిమి వెంకటేశ్వర్లు చంపబడ్డాడని తేలడంతో విచారణ చేపట్టారు. శివప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కొండయ్య పాల్గొన్నారు.